
సాక్షి పల్నాడు

శనివారం । 9 । ఆగస్టు । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.10 అడుగులకు చేరింది. ఇది 312.0450 టీఎంసీలకు సమానం.



అమ్మవారికి వెండి గాజులు

దాచేపల్లి : నారాయణపురానికి చెందిన తోట వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రూ.1.50 లక్షల విలువైన వెండి గాజులను స్థానిక వీర్ల అంకమ్మ తల్లికి బహూకరించారు.

నాగదేవతగా బూర్గులమ్మ



రేపల్లె: శ్రావణ శుక్రవారం నాడు గ్రామ దేవత బూర్గులమ్మ వారికి నాగదేవత అలంకరణ చేశారు. తొలుత అమ్మవారికి సుప్రభాత సేవ జరిగింది. పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా వీర్ల అంకాలమ్మ బోనాల ఉత్సవం



కారెంపూడి: పల్నాటి రణ క్షేత్రంలో అంకాలమ్మ బోనాల ఉత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్ద కాపులు బొమ్మిన శ్రీనివాసరావు, బొమ్మిన కొండల రావు(కొండ) కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. చెన్నకేశవస్వామి సన్నిధిలో ఉన్న బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతాన్ని అమ్మవారి సన్నిధిలో నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, విశ్రాంత డీటీ యడ్ల రామకృష్ణారావు, వైస్ ఎంపీపీ బొమ్మిన అల్లయ్య, మాజీ మునసబు పలిశెట్టి కోటేశ్వర రావు, ఆర్యవైశ్య సంఘ పెద్దలు ఇతర గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహంకాళీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతంతోపాటు విశేష పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సామూహికంగా వ్రతాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈవో కె.సునీల్ కుమార్ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై తక్షణ చర్యలు

జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశం



నరసరావుపేట రూరల్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. గత సోమవారం పీజీఆర్ఎస్‌లో ఇలా 25 ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదులపై స్పందించిన జిల్లా ఎస్పీ తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్‌లో 19 ఫిర్యాదులను పరిష్కరించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీసు యంత్రాంగం వారి సమస్య తెలుసుకుని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇబ్బందులు ఎదుర్కొటున్న వృద్ధుల వివరాలు పోలీసులు సేకరించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ముగిసిన భూ వరాహ స్వామి జయంతి వేడుకలు



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న భూ వరాహస్వామి జయంతి వేడుకలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో భూ వరాహస్వామి వారికి పంచామృతాలతో విశేష అభిషేకం, అర్చన నిర్వహించామని చెప్పారు. హయగ్రీవ జయంతిని పురస్కరించుకుని హయగ్రీవ హోమం, పూర్ణాహుతి, స్వామి వారికి అష్టోత్తర శతనామార్చన, ఆశీర్వచనంతో కార్యక్రమాలు వైభవంగా జరిగాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భూ వరాహ స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా పురాణం వెంకటాచార్యులు, శకుంతల దంపతులు పద్మావతి అమ్మవారికి వివిధ రకాల స్వీట్లు, వస్త్రాలు పండ్లతో సారెను అందజేశారు.

రుధిరదారులు

పల్నాడు జిల్లాలో నిత్యం ప్రమాదాలతో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. క్షణకాలంలో జరిగిన ప్రమాదాల వల్ల విలువైన నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబం తమ మనిషిని పోగొట్టుకోవడమే కాకుండా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోలేని పరిస్థితి ఎదురవుతోంది. జీవితాలు దుర్భరం అవుతున్నాయి. 2023-24 ఏడాదితో పోల్చితే ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. ఇప్పటికే 222 మంది వీటిల్లో మృత్యువాత పడ్డారు. అయినవారికి తీరని దుఃఖం మిగిల్చారు.

రహదారి ప్రమాదాల్లో గాలిలో కలసిపోతున్న విలువైన ప్రాణాలు

- 2025 తొలి అర్ధభాగంలో పెరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య
- జనవరి – జూన్ మధ్య 387 రహదారి దుర్ఘటనలు
- 222 మంది దుర్మరణం... మరో 339 మందికి గాయాలు
- 2023, 2024 గణాంకాలతో పోల్చితే పెరిగిన బాధితులు
- అతివేగం, నిర్లక్ష్యం, మద్యం మత్తులోనే ఎక్కువ ప్రమాదాలు
- మధ్యాహ్నం 3 – రాత్రి 9 గంటలలోపు అధిక దుర్ఘటనలు
- హెల్మెట్ వినియోగించకపోవడంతో బైకు చోదకుల్లో ఎక్కువ మంది మృతి



ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెంకి చెందిన కూలీల మరణానికి కారణమైన ట్రాక్టర్ (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసు, రవాణా శాఖ అధికారులు గుర్తించారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. రహదారుల్లో ప్రమాదకర మలుపులు, రోడ్ జంక్షన్ల వద్ద పోలీసులను కాపలా ఉంచి వాహనాలను నియంత్రిస్తున్నారు. ప్రమాదాల సంకేతాలను చూపించేలా సైన్ బోర్డులు పెట్టారు. రహదారుల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్స్, సోలార్ బ్లింకర్స్ ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు. అయినా ప్రమాదాలను మాత్రం కట్టడి చేయలేకపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని ఎంత అవగాహన కల్పిస్తున్నా చోదకుల్లో మార్పులు రావడం లేదు. దీంతో గతేడాది జరిగిన మొత్తం ప్రమాదాల్లో మూడో వంతు ద్విచక్రవాహన చోదకులవే ఉన్నాయి.

బ్లాక్ స్పాట్లు గుర్తింపు...

జిల్లాలో గత రెండు సంవత్సరాలలో రెండు, అంత కన్నా ఎక్కువ ప్రమాదాలు జరిగిన ప్రదేశాలు సుమారు 34 బ్లాక్ స్పాట్లు ఉన్నట్టు గుర్తించారు. ఆ ప్రదేశాలలో పోలీస్, రవాణా, నేషనల్ హైవేస్ మరియు ఆర్ అండ్ బీ శాఖలు సంయుక్త సర్వే నిర్వహించి ప్రమాదాలకు కారణాలను విశ్లేషించాయి. ఆయా బ్లాక్ స్పాట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ పెంచారు. ప్రమాదాలకు గల కారణలను విశ్లేషిస్తున్నారు. జంక్షన్ల వద్ద వాహనదారులు వేగాన్ని నియంత్రించకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణంగా తేలింది. నార్కట్‌పల్లి – అద్దంకి హైవేలో రొంపిచర్ల, పొందుగుల, గురజాల రోడ్ జంక్షన్, గుంటూరు–పిడుగురాళ్ల రహదారిలో కంటిపూడి, పిడుగురాళ్ల మండలం కామేపల్లి, ముప్పాళ్ళ, గుంటూరు – శ్రీశైలం రోడ్‌లో అందుగలపాడు, రావిపాడు గ్రామాల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించారు. వినుకొండ పరిసరాలలో కూడా ఇదే పరిస్థితి. మరోవైపు ప్రమాదాలు మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎక్కువగా జరుగుతున్నట్లు విశ్లేషిస్తున్నారు. ఆ సమయంలో వాహనదారులు మద్యం మత్తులో ఉండటమే దీనికి కారణమని భావిస్తున్నారు.

అతివేగం, నిర్లక్ష్యం వల్లే...



రోడ్డు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు, సమయం, కారణాలు, తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి, చర్యలు చేపడుతున్నాం. అతివేగం, మద్యం సేవించడం, జంక్షన్ల వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయి. అటువంటి చోట్ల సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. మైనర్‌లకు వాహనాలు ఇవ్వకుండా, వారికి ప్రమాదాల గురించి స్పష్టమైన అవగాహన కల్పించాలి.

– కంచి శ్రీనివాసరావు, జిల్లా ఎస్పీ, పల్నాడు

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	576	397	490
2024	612	380	591
2025	387	222	339

(తొలి 6 నెలలు)

గత మూడేళ్లుగా ప్రమాదాల వివరాలు...

వాహనాల వారీగా ప్రమాదాల తీరు...

ఏడాది	బైకులు	ఆటోలు	కార్, జీపులు	బస్సులు	ట్రక్కులు	ఇతరాలు
2023	179	57	85	37	158	51
2024	182	59	100	55	162	54
2025	129	48	62	25	100	23

(తొలి 6 నెలలు)

ఆయా రోజులలో గంటలవారీగా సమయంలో చోటుచేసుకున్న ప్రమాదాల సంఖ్య

00-03	03-06	06-09	09-12	12-15	15-18	18-21	21-00
15	25	47	46	59	62	79	54

కూలీల ఆటోలకు తరచూ ప్రమాదాలు

రెక్కాడితేగానీ డొక్కాడని వ్యవసాయ కూలీలు కూడా తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో పెద్దసంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకెళ్లడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి కారణం అవుతోంది. వేకువజామున ఆటోలు బయలుదేరడం, మళ్లీ చీకటి పడే వేళ ఇంటికి రావడం, ఆయా సమయాల్లో రోడ్లపై రద్దీ ఉండటం కూడా ప్రమాదాలకు కారణంగా మారుతోంది.



నాదెండ్ల మండలం కనపర్తి బావి సమీపం వద్ద 7వ తేదీన ప్రమాదానికి గురైన ఆటో (ఫైల్)

- ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన తమ స్వస్థలం ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెం నుంచి పక్క గ్రామమైన బొల్లవరం గ్రామ సమీపంలోని పొలంలో మిర్చి కోతకు కూలీలు వెళ్లి వస్తున్నారు. వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో నలుగురు మృతి చెందారు. మరో 16 మందికి గాయాలయ్యాయి.
- అదేవిధంగా ఫిబ్రవరి 7వ తేదీన నాదెండ్ల మండలం కనపర్తి బావి సమీపం వద్ద వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన లారీ వేగంగా అధిగమించే క్రమంలో ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఆటో అదుపు తప్పి ఎగిరిపడటంతో అందులో ఉన్న 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇలా నిత్యం ఏదో ఒకచోట కూలీలు ప్రయాణిస్తున్న వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి వల్ల కూలీల కుటుంబాల్లో విషాదం నెలకొంది. కుటుంబసభ్యుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోంది.

కనులు కాయలు కాచే..!

ఆర్డీ కోసం ఎదురు చూపులు

- వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ పోస్టు ఖాళీ
- ఆర్డీని ప్రభుత్వానికి సరెండర్ చేసిన అధికారులు
- కొత్త ఆర్డీని నియమించకపోవడంతో కష్టాలు
- ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వైద్య ఉద్యోగుల ఎదురు చూపులు



గుంటూరు ఆర్డీ కార్యాలయం

గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్య శాఖలో మూడు జిల్లాల ఉద్యోగులకు కీలకమైన అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో ఫోకల్ జోన్‌గా ఉన్న గుంటూరు కార్యాలయం చుట్టూ ఉద్యోగులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు, సెలవులు మంజూరు, ఇతర ఉద్యోగ కార్యకలాపాల బాధ్యతలన్నీ గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) పర్యవేక్షిస్తారు. ఆర్డీ సంతకం లేకుండా ఉమ్మడి మూడు జిల్లాల ఉద్యోగుల ఫైల్స్ ఒక అంగుళం కూడా ముందుకు వెళ్లవు. అలాంటి కీలక రీజనల్ డైరెక్టర్‌ను గతనెల ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆ స్థానంలో నూతనంగా ఎవరిని నియమించలేదు. కనీసం ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పగించలేదు. దీంతో ఎవరు వస్తారు, ఎప్పుడు వస్తారనే విషయం తెలియక మూడు జిల్లాలకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొంత మంది ప్రమోషన్లు, మరికొంత మంది సెలవు మంజూరు జాప్యం అవుతుందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తరచుగా సెలవులు... ఫైల్స్ పెండింగ్

గుంటూరు ఆర్డీగా డాక్టర్ కె.సుచిత్ర గత ఏడాది ఆగస్టులో బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి అనారోగ్య కారణంతో తరచూ సెలవులు పెట్టేవారు. నెలల తరబడి సెలవులు పెట్టడం, ఒక్కోసారి కార్యాలయానికి వచ్చినప్పటికీ అనారోగ్య కారణంతో ఫైల్స్‌పై సంతకాలు పెట్టకుండా కూర్చుండిపోవడం వల్ల మూడు జిల్లాలకు చెందిన ఉద్యోగులు తమ ఫైల్స్ పెండింగ్ ఉంటున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు ఫైల్స్‌కు సంబంధించి కూడా సంతకాలు చేయడంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆర్డీ కార్యాలయం ఉద్యోగులు, అధికారులు, అందరూ మూకుమ్మడిగా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆర్డీని మార్చాలని లిఖిత పూర్వకంగా కోరారు. తరచూ తమపై దాడి చేసిందంటూ ఉద్యోగులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆర్డీ కూడా తనకు కార్యాలయంలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని, ఉద్యోగులు తనపై దాడి చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. గత నెలలో రెండు వారాల పాటు సెలవు పెట్టిన ఆర్డీని రాష్ట్ర ఉన్నతాధికారులు సరెండర్ చేశారు. దీంతో ఈ నెల 1 నుంచి ఆర్డీ కార్యాలయంలో ఫైల్స్‌పై సంతకాల కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

2,500 మందికి పైగా ఉద్యోగులు

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఆర్డీ కార్యాలయం పరిధిలో 2,500 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. స్టాఫ్ నర్సులు, హెడ్‌నర్సులు, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్ఈఓలు, సీహెచ్‌ఓలు, రేడియోగ్రాఫర్లు, ఫార్మాశిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు, ఇలా పలు కేడర్లకు చెందిన పారా మెడికల్, మినిస్టీరియల్ ఉద్యోగులు ఆర్డీ కార్యాలయం పరిధిలో ఉన్నారు. వీరిలో 25 కేడర్లకు చెందిన ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. పలువురు ఉద్యోగులకు వ్యక్తిగత, మెడికల్ సెలవులు, ఇంక్రిమెంట్లు, ఇతర అలవెన్సులకు సంబంధించిన ఫైల్స్ వందకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు ఫైల్స్‌ది అదే పరిస్థితి.

ఇన్‌చార్జి నియామకంపై జాప్యం

గతంలో రెగ్యులర్ ఆర్డీ దీర్ఘకాలిక సెలవులో వెళ్లినా, పదవీ విరమణ చేసినా, బదిలీ అయినా, మరో రెగ్యులర్ ఆర్డీ విధుల్లో చేరే వరకు తాత్కాలికంగా వేరొకరిని నియమించేవారు,. తాత్కాలిక, ఆర్డీని ఎఫ్ఏసీ హోదాలో నియమించేందుకు ఏమైనా ఆటంకాలు ఏర్పడితే ఆర్డీ పోస్టు ఖాళీగా ఉండకుండా, కనీసం గుంటూరు డీఎంహెచ్ఓను ఇన్‌చార్జి ఆర్డీగా నియమించి, ఆర్డీ కార్యాలయం కార్యకలాపాలు సజావుగా జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేవారు. నేడు వీటిల్లో ఏ ఒక్కటి జరగకపోవడం, కనీసం ఆర్డీ కార్యాలయానికి అధికారిని కూడా నియమించకపోవడంతో ఉద్యోగులకు ఎదురు చూపులు తప్పడం లేదు. రాష్ట్ర ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఇన్‌చార్జి ఆర్డీని నియమించి ఫైల్స్ పెండింగ్ లేకుండా చూడాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

ప్రేమానురాగాలకు ప్రతీక

- నేడు రాఖీ పౌర్ణమి
- మార్కెట్‌లో పలు రకాల రాఖీలు



సత్తెనపల్లి: వెలకట్టలేని బంధాలను, వదులుకోలేని అనుబంధాలను గుర్తుచేసే మధుర బంధమే రక్షా బంధన్. సర్వకాల సర్వావస్థల యందు తనకు రక్షణగా ఉండాలనే ఉద్దేశంతో తన సోదరులకు శ్రావణ పౌర్ణమి (రాఖీ పౌర్ణమి) రోజున సోదరి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుంటుంది. అన్నదమ్ముల యశస్సు, శ్రేయస్సు కోరి రాఖీ కట్టే సంప్రదాయం అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తోంది. రక్తం పంచుకుని పుట్టిన అన్నాచెల్లెళ్లే కాకుండా ఏ బంధం లేకున్నా కుల, మతాల కతీతంగా ఆత్మీయుల మధ్య ఐక్యతను చాటి చెప్పేందుకు ఈ పండుగ ఓ వేదిక. రాఖీ పౌర్ణమి పండుగను సంతోషంగా నిర్వహించేందుకు అందరూ సిద్ధమయ్యారు.

జోరందుకున్న అమ్మకాలు...

సోదరులకు రాఖీలు కట్టేందుకే ఇప్పటికే చాలామంది సోదరీమణులు తమ పుట్టిళ్లకు చేరుకున్నారు. విద్యార్థినీ, విద్యార్థులు .. యువతీ, యువకులు మధ్య సోదర భావం పెంపొందించేందుకు కొన్ని పాఠశాలలు, కళాశాలలో ఈ వేడుకలను ప్రత్యేకంగా నిర్వ హిస్తున్నారు. శనివారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో రాఖీ విక్రయాలు జోరందుకున్నాయి. ఆన్‌లైన్‌లోనూ అమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయి. వివిధ వెబ్‌సైట్లలో రాఖీలకు సంబంధించి అనేక మోడళ్ళు అందుబాటులో ఉన్నాయి. దానికి తోడు వెండితో తయారుచేసిన రాఖీలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. ప్రముఖ బంగారు దుకాణాలు సైతం ఇలాంటి రాఖీలను విక్రయిస్తున్నాయి.



ఓ దుకాణం వద్ద రాఖీల కొనుగోలు



ధనలక్ష్మీ అలంకారంలో కనకదుర్గమ్మ

పిడుగురాళ్ల పట్టణం భవానీనగర్‌లోని కనకదుర్గమ్మ వారు శుక్రవారం ధనలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు సుమారు రూ.5 లక్షల కరెన్సీనోట్లతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. - పిడుగురాళ్ల

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,500 గరిష్ఠం : రూ. 2,400

మోడల్ ధర రూ. 1,900

క్లుప్తంగా

ఆదాయపు పన్ను చట్టానికి లోబడి వ్యవహరించండి



నరసరావుపేట టౌన్: ఆదాయపు పన్ను చట్టానికి లోబడి వ్యాపారులు వ్యవహరించాలని గుంటూరు ఆదాయపు పన్ను శాఖ అధికారి బి.ఎ. ప్రసాద్ బాబు అన్నారు. నరసరావుపేట విజయ కళ్యాణ మండపంలో శుక్రవారం బంగారు, వజ్రాల వ్యాపారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యాపార సంస్థలు ఆదాయపు పన్ను ఎంట్రీలు ఫాం 60, ఫాం 61లు నింపే విధానాన్ని వివరించారు. వ్యాపారులు అడిగిన పలు ప్రశ్నలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివృత్తి చేశారు. ఆదాయ పన్ను నియమాలను వివరించారు. ఐటీ రూల్స్ ప్రకారం వ్యాపారులు నడుచుకోవాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను అధికారి రామశాస్త్రి, ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు గొడవర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని గుండయ్యతోటలో రెవెన్యూ ఉద్యోగులపై దాడి చేసిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు.. డెప్యూటీ తహసీల్దార్ ఆదేశాల మేరకు ఈనెల ఆరో తేదీన పసుమర్రు సచివాలయం-1 సర్వేయర్ విద్యాసాగర్, వీఆర్వో కె.చంద్రశేఖర్, వీఆర్ఏ ఆశీర్వాదం తమ పరిధిలోని సర్వే నంబర్లు 803, 807లో స్థితిగతులు పరిశీలించేందుకు వెళ్లి ఫొటోలు తీస్తుండగా, అక్కడే నివాసం ఉంటున్న సీహెచ్ శ్రీనివాసరావు, అతడి ఇద్దరు కుమారులు ఎందుకని ప్రశ్నించగా వారిమధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఉద్యోగులపై ఘర్షణకు దిగిన ముగ్గురిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టు హాజరుపరిచినట్లు సీఐ పి.రమేష్ తెలిపారు.

• మహాలక్ష్మీ నమోస్తుతే..



నరసరావుపేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మీ అమ్మవారు



శ్రీసాయి మందిరంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

- నరసరావుపేట ఈస్ట్

ఇక సెలవు..!



శంకర్ విలాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి



- కాల గర్భంలోకి శంకర్ విలాస్ ఆర్వోబీ
- నేటి నుంచి కూల్చివేత పనులు ప్రారంభం
- ఏడు దశాబ్దాలుగా వారధిగా నిలిచి.. గుంటూరు ప్రజలకు సేవలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన శంకర్ విలాస్ ఆర్వోబీ ఇక చరిత్రగా మిగిలిపోనుంది. 70 ఏళ్ల పాటు ప్రజా రవాణాలో కీలకపాత్ర పోషించిన బ్రిడ్జి శాశ్వతంగా కనుమరుగు కానుంది. పెరుగుతున్న ప్రజా రవాణా అవసరాలకు అనుగుణంగా శంకర్‌విలాస్ ఆర్వోబీ స్థానంలో నాలుగు లైన్లతో నూతన ఆర్వోబీని నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించిన ప్రభుత్వం గత రెండు నెలలుగా భారీ వాహనాలను దారి మళ్లింపు చేసింది. లారీలు, బస్సులను శంకర్‌విలాస్ ఆర్వోబీపైకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తున్నారు. ఈ విధంగా గత నెల రోజులకు పైబడి బ్రిడ్జిపై బైక్‌లు, కార్లు, ఆటోలు మినహా ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రెండు వైపులా పిల్లర్ల నిర్మాణాలు చేపట్టడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోల రాకపోకలు సాగిస్తుండగా, నిర్మాణ పనుల్లో భాగంగా శనివారం నుంచి అన్ని వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రకటించారు. దీంతో ఇక శంకర్‌విలాస్ ఆర్వోబీ కనుమరుగు కానుంది. 70 ఏళ్ల పాటు సేవలందించిన మహా నిర్మాణం ఇక చరిత్రగా మిగిలిపోనుంది.

గుంటూరుకు ప్రత్యేక గుర్తింపు

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న శంకర్‌విలాస్ బ్రిడ్జి ఒక ప్రత్యేకత సంతరించుకుంది. గుంటూరు నగరంలో ముఖ్యమైన కూడలిగా మారడంతో పాటు 10 లక్షలకు పైగా జనాభా ఉన్న గుంటూరు నగరంలో ప్రతి ఒక్కరు రోజులో ఒక్కసారి కచ్చితంగా తలచుకునే అత్యంత కీలకమైన ప్రాంతంగా మారింది. విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగస్తులు, వ్యాపారుల నిత్య జీవితంలో అంతర్భాగమై సేవలు అందించిన శంకర్ విలాస్ నగర ప్రజల జీవితాల్లో ఒక భాగమైంది.

శంకర్ విలాస్ ఆర్వోబీ చరిత్ర

నగరానికి నడిబొడ్డున కోస్తా జిల్లాల ప్రజలందరికీ వైద్య సేవలు అందించేందుకు బ్రిటీష్ పాలకులు 1848లో 11 ఎకరాల విస్తీర్ణంలో జీజీహెచ్‌ను నిర్మించారు. తరువాత కాలంలో దానికి అనుబంధంగా 1946లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభమైంది. నిత్యం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే ప్రజలు, ఇప్పటి బ్రిడ్జి స్థానంలో ఉన్న రైల్వే గేటు వల్ల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొనడంతో దీనిని గమనించిన స్వాతంత్ర్య సమరయోధుడు, నాటి మునిసిపల్ చైర్‌పర్సన్ నడింపల్లి నరసింహారావు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 1958లో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మించారు. తద్వారా ప్రజల ఇక్కట్లను తొలగించి, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

బ్యాంకుల్లో పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు
- బ్యాంకుల భద్రత, సైబర్ నేరాలపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: బ్యాంకులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల భద్రతా ప్రమాణాలపై జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం బ్యాంకు మేనేజర్లు, సెక్యూరిటీ అధికారులతో జిల్లా ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీసీ టీవీ కెమెరాల వినియోగం, సెక్యూరిటీ గార్డుల పనితీరు, అలారం సిస్టమ్స్, డబుల్ లాక్ విధానం వంటి సాంకేతిక చర్యలతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సూచనలు చేశారు. బ్యాంక్ ప్రాంగణంలో రాత్రి సమయాల్లో లైటింగ్ సౌకర్యం, సెక్యూరిటీ గార్డుల పహారా, నగదు రవాణా సమయంలో జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుకంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని, ప్రజల భద్రత కోసం బ్యాంకు, పోలీసుల మధ్య సమన్వయం నిరంతరం కొనసాగాలని తెలిపారు. అలాగే జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలపై చర్చించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ కాల్స్, కృతిమ వెబ్‌సైట్ల ద్వారా జరుగుతున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. బ్యాంక్ ఖాతాదారుల డేటా భద్రత, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 1930 గురించి సోషల్ మీడియాలో ప్రచారం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్, యూనియన్ బ్యాంక్ ఎల్‌డీఎమ్ కె.రాంప్రసాద్, ఎస్‌బీ సీఐ పి.శరత్ బాబు, పలు బ్యాంకుల మేనేజర్లు, సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో కమీషన్ ఏజెంట్ల నియామకాలు

నరసరావుపేట టౌన్: నరసరావుపేట పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాలు కమీషన్ బేసిస్ ఏజెంట్‌లుగా పనిచేసేందుకు ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని డివిజనల్ సూపరింటెండెంట్ మహ్మద్ జాఫర్ సాదిక్ శుక్రవారం తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ చదివిన వారు అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీ డివిజనల్ పోస్టల్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటాతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94946 42465 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బిహార్‌లో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించండి

- మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు
- గుంటూరులో నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కేంద్ర ఎన్నికల సంఘం అప్రజాస్వామికంగా బిహార్‌లో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను ప్రజాస్వామికవాదులు అంతా వ్యతిరేకించాలని, ఇది కేవలం బిహార్ రాష్ట్రానికే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియను నిర్వహించి బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసే వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే కుట్రలో భాగమని శాసన మండలి మాజీ సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. గుంటూరు అంబేద్కర్ సెంటర్ (లాడ్జి సెంటర్)లో కేంద్ర ఎన్నికల సంఘం బిహార్‌లో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్‌కు వ్యతిరేకంగా సీపీఐ(యం) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ 2024 ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలవకపోవటంతో బిహార్ రాష్ట్రంలో ఎలాగైనా తమ అధికారాన్ని నిలబెట్టుకోవాలని అక్రమ పద్ధతులకు ఒడికట్టిందని విమర్శించారు. ఓటర్లు నమోదు చేసుకునేందుకు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఓటరు కార్డులు గుర్తింపు కార్డులుగా చూపించవచ్చని, కానీ బిహార్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియలో ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు తాత, ముత్తాతల నాటి గుర్తింపు కావాలని ఎన్నికల సంఘం చెపుతుందని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకొని అప్రజాస్వామిక పద్ధతుల్లో ప్రధానంగా వలస కార్మికులు, మైనార్టీల సుమారు 70 లక్షల ఓట్లు తొలగించారన్నారు. ఇది కేవలం ఒక్క బిహార్ రాష్ట్రానికే పరిమితం కాదని, దేశం మొత్తం ఈ పద్ధతిని అనుసరిస్తారని, దీనిని ప్రజాస్వామికవాదులు, ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పార్టీ నగర కార్యదర్శి కె. నళినీకాంత్, ప్రత్యేక హోదా సాధనా సమితి నాయకులు అవధానుల హరి, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, వ్యవసాయ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు, రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు సదాశివరావు, సీపీఎం జిల్లా, నగర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

యాసిడ్ లోడ్‌తో వెళ్తున్న ట్రక్ ఆటో బోల్తా
మహిళ దుర్మరణం



ఘటనాస్థలంలో యాసిడ్‌ను శుభ్రం చేస్తున్న ఫైర్ సిబ్బంది

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ బైపాస్‌రోడ్డులో యాసిడ్ లోడుతో వెళ్తున్న ట్రక్ ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఓ మహిళ దుర్మరణం చెందింది. గుంటూరుకు చెందిన ఆటోడ్రైవర్ షేక్ అల్లాభక్షు శుక్రవారం యాసిడ్ లోడుతో ఏలూరు బయలుదేరాడు. తోడుగా ఉంటుందని తన భార్య షేక్ షంషాద్(47)ను వెంట తీసుకెళ్లాడు. హనుమాన్‌జంక్షన్ బైపాస్‌రోడ్డు వద్దకు రాగానే ట్రక్కు ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఉన్న షంషాద్ రోడ్డుపైకి పడిపోయింది. ట్రక్కులో ఉన్న యాసిడ్ డ్రమ్ములు కిందకు ఒరిగి షంషాద్‌పై యాసిడ్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. అలాభక్షు కంటిలో యాసిడ్ పడటంతో పాటుగా శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. రహదారిపై యాసిడ్ పడి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న హనుమాన్‌జంక్షన్ ఫైర్ ఆఫీసర్ వి.అమరేశ్వరరావు సిబ్బందితో రహదారిపై పడిన యాసిడ్‌ను శుభ్రం చేయించారు. క్రేన్ సాయంతో ట్రక్కు ఆటోను రహదారిపై నుంచి పక్కకు తొలగించారు. ఘటనపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటోడ్రైవర్ షేక్ అల్లాభక్షును చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. షంషాద్ మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడి మృతి
తండ్రికి తీవ్రగాయాలు



వినుకొండ: దేవుని వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకుని అన్నదానం చేసి తిరిగి ఇంటికి వెళుతున్న ఆటో ప్రమాదానికి గురి కావడంతో నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం వెంకుపాలెం సమీపంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం సీతారాంపురం తండాకు చెందిన మేరజ్యోతి ప్రసన్న కుమార్ నాయక్, తన కుమారుడు రామాంజనేయులు (4)తో కలిసి, ఆటోలో ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో పడిపోవడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రసన్న కుమార్ నాయక్‌ను వినుకొండలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

వ్యాపారి అనుమానాస్పద మృతి

వినుకొండ: వినుకొండ టౌన్‌లో టీ వ్యాపారం నిర్వహిస్తున్న గోలి రమేష్ (47), మార్కాపురం రోడ్డులోని పసుపులేరు వంతెన సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన అనుమానాస్పదంగా మృతి చెందాడు. రమేష్ మృతికి కారణాలు తెలియరాలేదు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.